సాక్షి
బాపట్ల

బుధవారం । 1 । జనవరి । 2025

I



ఐ లవ్ సత్తెనపల్లి

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్‌లో విద్యుత్ దీపాలతో ఐ లవ్ సత్తెనపల్లి అంటూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అలంకరించారు.



న్యాయశాఖ క్యాలెండర్ ఆవిష్కరణ

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలోని డీజే హాల్‌లో న్యాయశాఖ నూతన క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ.పార్థసారథి ఆవిష్కరించారు.



ఆలయానికి రూ.లక్ష విరాళం

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం అభివృద్ధికి కందుల శ్రీనివాసరావు, మాధవి దంపతులు రూ.లక్ష సోమవారం అందజేశారు.

న్యూస్‌రీల్

పర్చూరు సమన్వయకర్తగా గాదె మధుసూదన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి,బాపట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా గాదె మధుసూదన్ రెడ్డిని నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు గాదె మధుసూదన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. గత ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గ అబ్జర్వర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా మధుసూదన్‌రెడ్డిని పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేంజ్‌లో 63 మంది సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి


నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు జాబితాను సిద్ధం చేశారు. వారం రోజుల కిందట ఈ జాబితాను సిద్ధం చేయగా, 63 మంది సీఐలు ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. సీఐలు కె.వేమారెడ్డి, బెల్లం శ్రీనివాసరావు, ఎస్‌వి.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసుల రెడ్డి, డీవి.చౌదరి, ఎన్.శ్రీకాంత్‌బాబు, ఎస్.అంటోనిరాజు, ఎం.లక్ష్మణ్, బత్తుల శ్రీనివాసరావు, ఐ.శ్రీనివా సన్, బి.రమేష్‌బాబు, ఎ.అశోక్‌కుమార్, కొంకా శ్రీనివాసరావు, ఏవీ.రమణ, ఎం.హైమారావు, షేక్. కరిముల్లాషావలి, యూవీ.శోభన్‌బాబుతోపాటు పలువురు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతిలో ఉన్నారు.

కొత్త సంవత్సరానికి విద్యార్థుల స్వాగతం



ఇంకొల్లు (చినగంజాం): కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు విద్యార్థులు. ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ థీమ్ నిర్వహించారు. 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి (యూఎన్) అంతర్జాతీయ సహకార సంవత్సరం (ఐవైఎఫ్) (ఇంటర్ నేషనల్ ఆఫ్ కో ఆపరేటివ్స్- 2025) గా ప్రకటించింది. విద్యార్థులు 2025 సంవత్సరం థీంతో 'సహకారాలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి'.. అనే దృక్పథంతో మానవహారంతో విద్యార్థుల ప్రదర్శించారు. ఐక్యరాజ్య సమితి (యూఎన్) జనరల్ అసెంబ్లీ జూన్ 2025 స్వాగతం పలుకుతూ ఐక్యరాజ్యసమితి థీమ్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక



జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. మండల పరిధిలోని పంగులూరు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీ వారి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ఖోఖో పురుషుల జట్టు ఎంపిక జరిగింది. ఈఎంపికలో 13 జిల్లాల నుంచి సుమారు 37 మంది ప్రతిభ గల క్రీడాకారులు పాల్గొన్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. వారిలో అత్యున్నత ప్రతిభ గల క్రీడాకారులను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ తరపున పరిశీలకుడు నెల్లూరు డీఎస్‌డీఓ ఆర్కే యతిరాజు, ప్రకాశం జిల్లా ఖోఖో కోచ్ డీఎల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బి కాశీవిశ్వనాథ్‌రెడ్డి, గుంటూరు జిల్లా ట్రెజరర్ ఎం వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా ఖోఖో అసోసియేషన్ ట్రెజరర్ కె హనుమంతరావు, రైల్వే జాతీయ క్రీడాకారుడు కె శ్రీనివాసరావు పాల్గొని జట్టుకి 25 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పంగులూరు ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీలో 25 రోజుల పాటు శిక్షణ జరగనున్నట్లు పీడీ మేకల సీతారామిరెడ్డి తెలిపారు. అనంతరం జట్టు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఉత్తరాఖాండ్ రాష్ట్రంలో జరిగే 28వ జాతీయ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. క్యాంప్ 25 రోజులపాటు గ్రామస్తులు సహకారంతో చైర్మన్ బాచిన చెంచుగరటయ్య ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

సంక్షేమం నుంచి సంక్షోభం వైపు..

- గత పాలనలో అర్హులందరికీ సంక్షేమం
- దానికి దీటుగా అభివృద్ధి పథకాలు
- రైతులతోపాటు అన్నివర్గాల ప్రజలకు అండగా ప్రభుత్వం
- సుఖసంతోషాలతో ఉన్న ప్రజలు
- ఆరునెలల కూటమి పాలనలో సంక్షేమానికి పాతర
- ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలకు మంగళం
- అన్నదాత సుఖీభవలేదు– విద్యాదీవెన ఎగవేత
- ప్రకటనలకే పరిమితమైన అభివృద్ధి కార్యక్రమాలు
- వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తుచేసుకుంటున్న జనం




రివైండ్ 2024

వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఐదేళ్ల వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పార్టీలు, కులాలు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందుకొని పేద, మధ్యతరగతి ప్రజలు సుఖసంతోషాలతో గడపగా ఆరు నెలల చంద్రబాబు సంక్షోభపాలన ప్రజలను కష్టాల్లోకి నెట్టి కొత్త ఏడాది పండుగ సంబరాలకు దూరం చేసింది. జగన్ పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రతినెలా ఏదో ఒక పథకం ద్వారా నిధులు సమకూరగా చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క పథకం ద్వారా కూడా ప్రజలకు ఆర్థికంగా చేయూత లభించే అవకాశం లేకుండా పోయింది. గతంలో ఇచ్చిన సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారు. అన్నదాత సుఖీభవలేదు, తల్లికి వందనం లేదు. 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 అసలే ఇవ్వలేదు. ఇంటికి మూడు సిలెండర్లలో కోత పెట్టి ఒకటే ఇచ్చారు. రైతులు పండించిన ధాన్యాన్ని కూడా గిట్టుబాటు ధర ఇచ్చి కొనే పరిస్థితిలేదు. నిరుద్యోగ భృతిలేదు. సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు ప్రభుత్వం నెరవేర్చలేదు. మరోవైపు ప్రకటనలు తప్ప అభివృద్ధి కార్యక్రమాల ఊసేలేదు. సంక్షేమ పాలన గాడితప్పడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా చేయూత లేక ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. తద్వారా చిరువ్యాపారులు మొదలు అన్ని రకాల వ్యాపారాలు దివాళా తీశాయి. ప్రజలు కూటమి పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొత్త ఏడాది సంబరాలు వెలవెలబోతున్నాయి.

➡ అన్నదాతా దుఃఖీభవ

ఎన్నికల సమయంలో రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు పెట్టుబడి సాయమందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక హామీని తుంగలో తొక్కారు. జిల్లాలో 1,92,039 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.385 కోట్లు ఇవ్వాల్సి వుండగా పైసా ఇవ్వలేదు. తేమశాతంతో పాటు పలు ఆంక్షలతో పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక రైతులు ఆందోళన చెందుతున్నారు. మిల్లర్లతో కుమ్మక్కై మొక్కుబడిగా కూడా ప్రభుత్వం ధాన్యం కొనకపోవడంతో బయట మార్కెట్ వ్యాపారులు బస్తా రూ.1300 నుంచి రూ.1350కి మించి ధాన్యం కొనడంలేదు.



➡ తల్లికి వంచనం

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్ని ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో అమలు చేస్తామని ప్రచారం చేశారు. జిల్లాలో 1,16,019 మంది తల్లులు ఉండగా కూటమి ప్రభుత్వం చెప్పినట్లు ఇంట్లో కనీసం ఇద్దరికి ఇచ్చినా రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికి పైసా ఇవ్వలేదు.

➡ మహిళలకు రూ.1500 ఎగనామం

18 నుంచి 59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. జిల్లాలో 6,61,841 మంది మహిళలు ఉండగా నెలకు రూ.99.27 కోట్లు ఇవ్వాల్సి వుంది. ఇప్పటి వరకూ దాని ఊసేలేదు.

➡ కొందరికే సిలెండర్

ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలెండర్లు ఇస్తామని చెప్పి కొంతమందికి మాత్రమే ఒక్క సిలిండర్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఒక్కో కుటుంబానికి మూడు సిలెండర్ల చొప్పున రూ.2700 జమ చేయాల్సివుంది. జిల్లాలో 4,60,830 కుటుంబాలకుగాను రూ.124.42 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.

➡ రోడ్డెక్కని ఉచిత బస్సు

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని కూటమి నేతలు ఓట్లేయించుకున్నారు. జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేస్తే ప్రతిరోజూ 90 వేల మంది మహిళలు ప్రయాణించనున్నారు. వీరందరూ ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరికీ అన్నీ..

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జిల్లాలో సంక్షేమం ప్రతి ఇంటి తలుపు తట్టింది. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ క్యాలెండర్ ఏర్పాటుచేసి మరీ ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేశారు. ఆర్థిక కష్టాలకు దూరంగా ప్రజలు సంతోషంగా జీవనం సాగించారు.

- 1,16,019 మంది అమ్మ ఒడి లబ్ధిదారులకు రూ.489 కోట్లు చెల్లించారు.
- జగనన్న వసతి లబ్ధిదారులు 30,611 మందికి రూ. 29.16 కోట్లు లబ్ధి చేకూర్చారు.
- విద్యా దీవెన లబ్ధిదారులు 31,046 మందికి రూ.92.28 కోట్లు ఇచ్చారు.
- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా 1,92,037 మందికి రూ.1181 కోట్లు లబ్ధి చేకూర్చారు.
- మనబడి నాడు–నేడు ద్వారా రూ. 304.12 కోట్లు ఖర్చుచేసి 1433 పాఠశాలలు ఆధునీకీకరించారు.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 1,37,421 మందికి రూ.331.82 కోట్లు ఖర్చుచేశారు.
- వైఎస్సార్ చేయూత ద్వారా 85,846 మందికి రూ.439.13 కోట్లు నగదు లబ్ధి చేకూర్చారు.

ఇవేకాకుండా హామీ ఇచ్చిన అన్ని పథకాలను దాదాపు అమలు చేశారు. మ్యానిఫెస్టోలో చెప్పని అనేక హామీలనూ అమలుపరిచారు. నెలనెల లక్షలాది మందికి పింఛన్లు మొదలు అన్ని పథకాల ద్వారా ఆర్థిక లబ్ధి చేకూర్చారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు వైఎస్.జగన్ పాలనలో సంతోషంగా బతికారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి
- వార్షిక నేర నివేదికను వివరించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ వార్షిక నేర నివేదికను వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై జిల్లాలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెల్మెట్ వాడకపోవడం వలన కలిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు, డ్రగ్స్ సేవిస్తే కలిగే అనర్థాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పల్లె నిద్ర కార్యక్రమాల ద్వారా ప్రజలకు పోలీస్‌సేవలు విస్తృతం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 3637 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మొత్తం కేసుల్లో జిల్లాలోని ప్రజలు 37.84 లక్షలు సొత్తు కోల్పోయారు. వాటిల్లో 21.60 లక్షల సొత్తు రికవరీ చేసినట్లు తెలిపారు. మహిళలపై దాడికేసులు జిల్లాలో 531 కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలో 211 యాక్సిడెంట్ కేసులు నమోదు కాగా వాటిల్లో 234 మంది మృతి చెందారన్నారు. వాటిల్లో 425 మందికి గాయాలయన్నారు. జిల్లాలో సైబర్ మోసాల కారణంగా 90 కేసులకు గానూ రూ. 57.02 లక్షలు కొల్పొగా వాటిల్లో 17.11 లక్షల సొత్తు రికవరీ చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని 12,807 మందిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. జిల్లాలో ఈ ఏడాది నలుగురిపై పీడీ చట్టాలను ప్రయోగించడం జరిగిందన్నారు. వారిలో ఒకరిని జిల్లా బహిష్కరణ చేశామన్నారు. ఈ ఏడాది 55 సార్లు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించామన్నారు. నేరాల నియంత్రణకు జిల్లాలో 817 సీసీ కెమెరాలను ఏర్పాటుచేశామన్నారు. కార్తీక పౌర్ణమిను పురస్కరించుకొని తీరానికి లక్షలాది పర్యాటకులు వచ్చినప్పుడు డ్రోన్‌తో పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించామన్నారు.

టీడీపీ కౌన్సిలర్ల ఓవరాక్షన్

- మున్సిపల్ చైర్మన్ కుర్చీకి గౌరవం లేదంటూ వ్యాఖ్యలు
- అర్ధాంతరంగా సమావేశం వాయిదా



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

చీరాల: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. అజెండాలోని అంశాలు చర్చ జరుగుతున్న సమయంలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు కొందరు చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సాధారణ సమావేశంలో భాగంగా 7వ అంశంపై చర్చ జరిగింది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మామిడాల రాములు మాట్లాడుతూ ప్రభుత్వం సిల్టు తీసేందుకు రూ.60 లక్షలు కేటాయించిందని, అయితే సక్రమంగా తీయడం లేదని ఆరోపించారు. ప్రధానంగా మ్యాన్ హోల్స్ లేకపోవడంతో 30 మీటర్లు, 40 మీటర్లు వరకు ఉన్న వాటి వద్ద హోల్స్ ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలోనే సిల్టు తీయడం వలన కాలువలో పేరుకుపోయిన సిల్టు మొత్తం బయటకు రావడం లేదన్నారు. అలా కాకుండా తమ వార్డులలో అందరూ వ్యాపారస్తులు ఉన్న కారణంగా పండుగ తర్వాత కాలువలోని సిల్టు మొత్తం వచ్చేలా చేయాలని కోరారు. దీనిపై మున్సిపల్ డీఈ వివరణ ఇస్తుండగా మధ్యలో జోక్యం చేసుకున్న టీడీపీ కౌన్సిలర్ ఎస్.సత్యానందం మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం రూ.60 లక్షలు కేటాయించిందని, దీనితో సిల్టు పనులన్ని చాలా చక్కగా జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్ కొందరికి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన టీడీపీ కౌన్సిలర్..

దీంతో జోక్యం చేసుకుని చైర్మన్ కుర్చీకి గౌరవం ఉంటుందని, ఆ కుర్చీలో కూర్చొంటే పార్టీలతో సంబంధం ఉండదని, కౌన్సిలర్లందరిని ఒకే మాదిరిగా చూస్తారన్నారు. దీంతో సత్యానందం మాట్లాడుతూ 'అదొక కుర్చీనా.. దానికి గౌరవం ఉందా ? అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో చైర్మన్ సభను, ప్రథమ పౌరుడి కుర్చీని అవహేళన చేయడం సరికాదంటూ సభను వాయిదా వేస్తున్నామంటూ, మిగిలిన అంశంపై చర్చకు వెళ్లకుండా ఏడవ అంశంతోనే వాయిదా పడింది. ముందుగా వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటుపై చర్చ జరిగింది. కూరగాయల మార్కెట్ వద్ద వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని అనుమతి ఇస్తూ ఒకటో అంశాన్ని ఆమోదించింది. దీనిపై కూడా సత్యానందం అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు సత్యానందం, మల్లెల లలిత మాట్లాడుతూ చీరాల మొత్తం విగ్రహాల మయం అయిందని, ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉందని, విగ్రహాలన్నింటిని కుందేరు సమీపంలో గాని, మరో ప్రాంతంలో గాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ అజెండాలో పెట్టిన వంగవీటి విగ్రహ ఏర్పాటు అంశాన్ని ఆమోదించి మిగిలిన విగ్రహాలను ఎస్‌ఎస్ ట్యాంక్ వద్ద గల ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కౌన్సిల్ సమావేశం హాలులో ఎమ్మెల్యే ప్రభుత్వ పీఏ సుబ్బారావు, ప్రైవేటు పీఏ రవీంద్రలు కౌన్సిల్ హాలులో కూర్చొని టీడీపీ కౌన్సిలర్లకు దిశానిర్దేశం చేయడం విశేషం. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

8వ తేదీ నుంచి అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు

- మొదటి బహుమతి రూ.3 లక్షలు
- పాల్గొననున్న వివిధ రాష్ట్రాల జట్లు



అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు సిద్ధం చేసిన ఆర్‌ఎస్‌సీఏ గ్రౌండ్

మేదరమెట్ల: కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 31వ అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలు ఈనెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు మంగళవారం తెలిపారు. నిర్వాహకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గతంలో మాదిరిగానే ఈపోటీలు 20–20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.3 లక్షలు, రెండో జట్టుకు రూ.2 లక్షలు, మూడో జట్టుకు రూ.లక్ష నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బెస్ట్ బ్యాటర్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్‌లకు కూడా బహుమతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని, పోటీలు నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పోటీలను భ్రమర సంక్రాంతి కప్ పేరుతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు (బాబు), కార్యదర్శి మోపర్తి శేషారావు, రామినేని శ్రీనివాసరావు, కారుసాల సుబ్బారావు, మోపర్తి లక్ష్మీనారాయణ, చేబ్రోలు నాగేశ్వరరావు, యడ్లపల్లి నరసింహారావు, కారుసాల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

నేరం ఒకరిది...శిక్ష మరొకరికి

ఎమ్మెల్యేలు ఇసుక అమ్మితే వీఆర్వోలపై వేటా?

- జిల్లా ఉన్నతాధికారి తీరుపై సర్వత్రా విమర్శలు
- చీరాలలో పోటాపోటీగా ఎంపీ, ఎమ్మెల్యే అనుచరుల ఇసుక అమ్మకాలు
- ఎంపీ అనుచరుడి జేసీబీ తగులబెట్టిన ఎమ్మెల్యే వర్గీయుడు
- ఎంపీ అనుచరుల క్వారీల పరిధిలోని వీఆర్వోలను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్
- ఎమ్మెల్యే అనుచరుల క్వారీల జోలికి వెళ్లని వైనం
- వాటి పరిధిలోని రెవెన్యూ అధికారులపై నో యాక్షన్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా వ్యవహారం శృతిమించి రాగాన పడింది. బాపట్ల ఎంపీ, చీరాల ఎమ్మెల్యే వర్గాల మధ్య గొడవలకు దారితీసింది. ఏకంగా ఇసుక క్వారీలో ఉన్న ఎంపీ అనుచరుడు రామకృష్ణకు చెందిన జేసీబీని ఎమ్మెల్యే వర్గీయులు తగులబెట్టే వరకు వచ్చింది. దీనికి సంబంధించి పోలీసులు ఎమ్మెల్యే వర్గీయులు జితేందర్‌రెడ్డి, సతీష్ మరికొందరిపై కేసు నమోదు చేయగా ఇప్పటికి సతీష్ ఒక్కడినే అరెస్ట్ చేసి అరెస్టులకు తాత్కాలిక విరామమిచ్చారు. ఈ గొడవతో పచ్చనేతల ఇసుక రచ్చ రోడ్డున పడింది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ వెంకట మురళి చీరాల ఆర్‌ఐ నాగకుమార్, వీఆర్వోలు శివారెడ్డి, తులసీలను సస్పెండ్ చేసి చీరాల తహసీల్దారు గోపీకృష్ణతోపాటు మరికొందరికి కూడా షోకాజ్ నోటీసు ఇవ్వడం మరింత చర్చకు దారితీసింది. ఎంపీ అనుచరుల ఇసుక క్వారీలు ఉన్న ప్రాంతాల్లోని కొందరు వీర్వోలపై మాత్రమే వేటువేసిన కలెక్టర్ చీరాల నియోజకవర్గంలో మొత్తం ఇసుక దందా నడిపిస్తున్న ఎమ్మెల్యే వర్గీయుల ఇసుక క్వారీలు ఉన్న ప్రాంతానికి చెందిన రెవెన్యూ అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఇసుక దొంగతనం చేస్తున్న వారిని వదిలేసి క్రింది స్థాయి అధికారులపై వేటు వేయడంపైనా జోరుగా చర్చసాగుతోంది.

వాస్తవానికి వేటపాలెం పరిధిలో ఉన్న ఇసుక దిబ్బలు, అసైన్డ్, ప్రభుత్వ, అటవీ భూముల నుంచి ఎమ్మెల్యే అనుచరులు బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రానికి సైతం ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. వేటపాలెం మడంలంలోని పుల్లరిపాలెం సమీపంలోని భూములనుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమరవాణా జరుగుతోందని ఇసుక అక్రమరవాణా ఆపకపోతే వేసవిలో తమకు తాగునీరు కూడా దొరకదని ఈ ప్రాంతానికి చెందిన సాయి ఎస్టీ కాలనీ వాసులు ఏకంగా జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నారు. వారు స్పందించకపోవడంతో ఎస్టీలు ఏకంగా జాతీయ ఎస్టీ కమిషన్‌కు రెండు సార్లు ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. ఎస్టీల ఫిర్యాదును విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్టీ కమిషన్ ఆదేశించినా జిల్లా అధికారులు ఎమ్మెల్యే వర్గీయుల జోలికి వెళ్లక ఎస్టీలనే బెదిరించి సంతకాలు పెట్టాలని ఒత్తిడి తీసుకువచ్చినట్లు ఎస్టీలు ఆరోపించారు. పుల్లరిపాలెం సమీపంలోని భూములనుంచి ఎమ్మెల్యే వర్గీయులు పెద్దఎత్తున ఇసుక తరలిస్తున్న విషయం అందరికీ తెలుసు. వారంతా ఎమ్మెల్యే సొంత ప్రాంతానికి చెందిన అనుచరులన్న విషయం చీరాల ప్రాంతంలోనివారికి తెలుసు. నియోజకవర్గంలోని ఒక మండలానికి చెందిన తహసీల్దారు ఎమ్మెల్యే వర్గీయుల ఇసుక దందాకు పూర్తి సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సదరు తహసీల్దార్‌కు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉన్న విషయం రెవెన్యూ వర్గాల్లో గుసగుసలు ఉన్నాయి. తహసీల్దార్ గతంలో పనిచేసిన మండలం నుంచి తన సొంత మనుషులుగా ఉన్న తొమ్మిది మంది వీఆర్వోలను ప్రస్తుతం చీరాల నియోజకవర్గంలోని మండలానికి తెచ్చుకోవడం లోనూ కలెక్టర్ కార్యాలయం సహకారం ఉందన్న ప్రచారం ఉంది. తీరంలో వ్యవహారాలు నడిపే క్రమంలో ఉన్నతాధికారులు సదరు తహసీల్దార్‌కు సహకారం అందిస్తున్నట్లు గుసగుసలు ఉన్నాయి.

ఉన్నతాధికారులకు మినహాయింపా?

ఇంకో ప్రధాన విషయంపై చర్చ జరుగుతోంది. ఎంపీ, ఎమ్మెల్యే అనుచరులు ఇసుక అక్రమ రవాణా చేస్తుంటే వీఆర్వో స్థాయి అధికారులపై చర్యలు తీసుకోవడమేమిటో ఎవరికీ అంతుపట్టడంలేదు. అక్రమ రవాణా విషయం తహసీల్దారులు, ఆర్డీవో తదితర స్థాయి అధికారులకు తెలియదనుకోవాలా? లేక పెద్ద స్థాయి అధికారులపై చర్యలు తీసుకోవడం సరికాదనా? అధికారులపై సరే ఇసుక అమ్ముకుంటున్న ప్రజాప్రతినిధుల అనుచరుల సంగతేంటి? వారు కేసులకు అనర్హులా? ఏమో? ఉన్నతాధికారులే చెప్పాలి.

ప్రశ్నార్థకంగా కలెక్టర్ తీరు

ఇంత జరుగుతున్నా, ఇసుక అక్రమ రవాణాపై జాతీయస్థాయికి ఫిర్యాదులందినా ఆ ప్రాంతానికి చెందిన రెవెన్యూ అధికారులపై జిల్లా ఉన్నతాధికారి ఎందుకు చర్యతీసుకోవడం లేదన్న ప్రశ్న తలెత్తుతోంది. నిజంగా ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు తెలియదనుకోవాలా? లేక ఆ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరగడం లేదని నిర్ధారించుకున్నారా? అనే విషయంపై చర్చ సాగుతోంది.

వాస్తవానికి ఇసుక అక్రమరవాణాను అరికట్టే ఉద్దేశంతో స్థానిక రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటే హర్షించాల్సిందే! ఏ అధికారినైనా అభినందించాల్సిందే! అలాంటప్పుడు కొందరు అధికారులపైనే కాకుండా బాధ్యులైన అందరు అధికారులపై చర్యలు తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ స్థాయిలో ఎవరు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారో? తెలుసుకోవడం పెద్ద పనికాదు. కానీ చర్యలు నిష్పాక్షికంగా ఉంటే అందరూ హర్షిస్తారు. ప్రతి ఒక్కరూ మద్దతు పలుకుతారు.

అర్జీల పరిష్కారంలో బాపట్ల జిల్లా భేష్

- సీసీఎల్‌ఏ డెప్యూటీ కమిషనర్ జయలక్ష్మి
- కలెక్టర్, జేసీలకు అభినందనలు

బాపట్ల: రెవెన్యూ సదస్సులు, రీ సర్వేలలో నమోదయ్యే అర్జీల పరిష్కారంలో బాపట్ల జిల్లా భేష్ అని సీసీఎల్‌ఏ డిప్యూటీ కమిషనర్ జయలక్ష్మి ప్రశంసించారు. రెవెన్యూ సదస్సులు, భూముల రీ సర్వేపై సీసీఎల్ నుంచి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు. బాపట్ల జిల్లాలో రెవెన్యూ సదస్సులు, రీ సర్వేలలో బాపట్ల జిల్లా అధికారులు బాగా పనిచేస్తున్నారని కితాబు నిచ్చారు. జిల్లాలో ఇప్పటివరకు 4,961 అర్జీలు నమోదు కాగా 98శాతం పరిష్కరించడంపై జిల్లా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్‌లను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. సదస్సులు ముగిసే వరకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆమె సూచించారు. రెవెన్యూ సదస్సులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమన్నారు. భూ సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయి మరింత మెరుగ్గా ఉండేలా తహసీల్దార్లు పని చేయాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి భూములను తొలగించిన సంబంధిత దస్త్రాలను పునఃపరిశీలించాలన్నారు. జనవరి మొదటి వారంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. సరిహద్దు రాళ్లపై బొమ్మలను తొలగించే ప్రక్రియ బాపట్ల జిల్లాలో 64శాతం పూర్తి చేయడం అభినందనీయమని రీ సర్వే అదనపు ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బాపట్ల జిల్లాలో శరవేగంగా ఈ ప్రక్రియ జరగడం అభినందనీయమన్నారు. ఇదే మాదిరిగా అన్ని జిల్లాల్లోనూ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రీ సర్వేపై క్షేత్రస్థాయిలో పని చేసే రెవెన్యూ సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. బాపట్ల జిల్లాలో నాణ్యత ప్రమాణాలతో పరిష్కార ప్రక్రియ జరుగుతుందని అభినందించారు. జిల్లా నుంచి జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.